విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 17, మార్చి 2023

పది పరీక్షల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు కీలక పాత్ర పోషించాలి

విశాలాంధ్ర - నంద్యాల : 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు కీలక పాత్ర పోషించి పరీక్షల నిర్వహణలో అత్యంత కఠినంగా వ్యవహరిం చాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని వైయస్సార్ సెంటనరీ హాలులో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల పకడ్బందీ నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, కస్టోడియన్ అధికారులు, డిపార్ట్మెంట్ అధికారులు, ఎంఈఓల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షల్లో పేపర్ లీకేజీ, మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ తదితర అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే సంబంధిత అధికారులపై తీవ్ర కఠిన చర్యలు తప్పవన్నారు. ఒక చిన్న రూమర్ మొత్తం ప్రక్రియనంతటిని చిన్నాభిన్నం చేస్తుందని, అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటూ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. నూతనంగా ఏర్పాటైన జిల్లాలో గత సంవత్సరం ప్రశ్నాపత్రాన్ని ఫోటో తీసి వాట్సాప్ లలో పోస్ట్ అయి వైరల్ కావడం కారణంగా సంబంధిత అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయడం జరిగిందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు, ఎంఈఓలు, ఇన్విజిలేటర్లు చిత్తశుద్ధితో అప్రమత్తంగా పరీక్షలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఫర్నీచర్, విద్యుత్తు తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144సెక్షన్ అమలు చేయడంతో పాటు పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ షాపులు మూసి వేయడం జరుగుతుందన్నారు. పరీక్షలకు గైరు హాజరైన విద్యార్థుల ప్రశ్నాపత్రాలు అల్మారాలో జాగ్రత్తగా భద్రపరిచేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, డీఈఓ అనురాధ, చీఫ్ సూపర్నెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు, ఎంఈఓలు, కస్టోడియన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రవేశ పెట్టేది ఒకటి, అమలుపరిచేది మరొకటి

విశాలాంధ్ర - డోన్ : అసెంబ్లీలో... జీతాలు ఇవ్వలేకపో వడం, బిల్లులు చెల్లించ లేకపోడం, అభివృద్ధి చేయలేక పోయిన ప్రభుత్వానికి బడ్జెట్ ప్రవేశపెట్టే అర్హత లేదంటూ తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్యే లు చేసిన నిరసనకు సమాధానం చెప్పలేక స్పికర్ సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని డోన్ నియోజకవర్గ టీడిపి అభ్యర్థి ధర్మ వరం సుబ్బారెడ్డి అన్నారు.గురువారం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలన నిర్వాహం వల్ల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని దివాలా తియించారని అన్నారు. ఈ బడ్జెటు వాస్తావాని దూరంగా ఉందని రాష్ట్రంలో రైతాంగం కానీ, యువత కానీ, మహిళాలు కానీ ఎవరు సంతోషం గా లేరని ఆర్థిక మంత్రి బుగ్గన బడ్జెట్ ప్రవేశ పెట్టేది ఒకటి, అమలు పరిచేది మరొకటని ఆర్థికమంత్రి చరిత్ర హీనుడిగ మిగిలిపోతాడని, బుగ్గనకు ఇవే చివరి ఎన్నికలు అని అన్నారు. గత సంవత్స రంలో ఇరిగేషన్ కు 12వేల కోట్లని చెప్పి, 4వేలకోట్లు రుపాయలే ఖర్చు చేశారని, రహదారుల గురించి 9వేల కోట్లని చెప్పి ఒక రపాయి కూడా ఖర్చు చేయలేదని అన్నా రు. 54 కార్పొరేషన్‌లు పెట్టామని అన్ని కార్పొరేషన్ లకు డబ్బులు కేటాయించని అంకెలు చదవ డమే తప్ప ఒక రుపాయి ఖర్చు చేయలేదని ఈ బడ్జెట్టు మోసపూరిత బడ్జెట్టు అని అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్టే ఈ ప్రభుత్వానికి,జగన్‌రెడ్డికిఉరితాడు అవుతుందని అన్నారు.

లోక్ అదాలత్ మెంబర్లుగా నియామకం

విశాలాంధ్ర - బనగానపల్లె : బనగానపల్లె జూనియర్స్ జడ్జి కోర్టు నందు లోక అదాలత్ సభ్యులుగా సీనియర్ అడ్వకేట్ వి. ప్రకాష్‌రెడ్డి, మండల రఘురామిరెడ్డి సామాజిక సేవ కోటాలో బనగానపల్లి ప్రముఖులు డి వెంకటసుబ్బయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ నియమించినట్లు బనగానపల్లె జూనియర్ జడ్జి తెలిపారు. మండల న్యాయ సేవ అధికార సంస్థ నందు చైర్మన్‌గా స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఉంటారు. ఇరువురిని న్యాయవాద సభ్యులుగా అలాగే సోషల్ వర్కర్ గా స్థానిక దమ్మాల వెంకటసుబ్బయ్యను నియమించారు. ఉన్నత న్యాయస్థానాలు నిర్వహించే మెగా లోకదాలత్ లేదా సాధారణ లోక్ అదాలతో నిర్వహణలో వీరు కమిటీ సభ్యులుగా ఉంటారు.

సెపక్ తక్ర బ్రోచర్ విడుదల

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి గురువారం ఏపి కర్నూలు, నంద్యాల జిల్లాల సెపక్ తక్ర అసోసియేషన్ టోర్నమెంట్ బ్రోచర్ ను కమిటీ చైర్మన్ బద్దుల శ్రీధర్ జి.శ్రీనివాసులుతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందికొట్కూరులో నవనంది స్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల మార్చి 18,19 తేదీలలో ఆంధ్రప్రదేశ్ 33వ సీనియర్ విభాగంలో పురుషులు, స్త్రీల సెపక్ తక్ర ఛాంపియన్ పోటీలు నిర్వహించడం జరుగు తుందని పురుషులు, స్త్రీలు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ కమిటీ చైర్మన్ బద్దుల శ్రీధర్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ శంకర్ రెడ్డి కౌన్సిలర్‌లు హమీద్ మియ్య, కాటెపోగు చిన్న రాజు, వి.ఆర్ శ్రీను, పట్టణ సోషల్ మీడియా కో-కన్వీనర్ బ్రహ్మయ్య, సుబ్బన్న పాల్గొన్నారు.

గేట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన ప్రమోద్

విశాలాంధ్ర - అవుకు : గత నెల 4న నిర్వహించిన గేట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్) పరీక్ష ఫలితాల్లో అవుకు పట్టణానికి చెందిన సాత్రి ప్రమోద్ కుమార్ ఆల్ ఇండియా స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి 384 ర్యాంకు సాధించాడు. ప్రమోద్ కుమార్ తండ్రి సాత్రి రామయ్య పాత్రికేయ వృత్తిలో బనగానపల్లి నియోజకవర్గంలో ఓ ప్రముఖ చానల్లో పనిచేస్తున్నాడు. సాత్రి రామయ్య అనురాధ దంపతుల కు ఇద్దరు కుమారుల సంతానం. వీరిలో ద్వితీయ కుమారుడు ప్రమోద్ కుమార్.ఇతను ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకు హైదరాబాదులోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో (హెచ్పిఎస్, బేగంపేట్)లో పదవ తరగతి లో 93.8% ఉత్తీర్ణత సాధించాడు. ట్రిపుల్ ఐటీ బాసరలో బీటెక్ సిఎస్సి92.4% మార్కులు సాధించాడు. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ పరీక్షల్లో 8 లక్షల మంది హాజరవగా అవుకుకు చెందిన ఈ యువకుడు అరుదైన రికార్డ్ స్థాయిలో ర్యాంక్ సాధించాడు.తమ కుమారుడు ర్యాంకు సాధించాడన్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు,మిత్రులు హర్షం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పాణ్యం మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారధి రెడ్డి, గూడాల సోదరులు, పలువురు ప్రముఖ నాయకులు ఫోన్లో ప్రమోద్ కుమార్ ను అభినందించారు.

నేడు రోఖియాభి ఉరుసు

విశాలాంధ్ర - వెలుగోడు : పట్టణంలో వెలిసిన హాజరత్ సయ్యద్ రోఖియాభి ఉరుసు మహోత్సవం శుక్రవారం జరుగుతుంది. గురువారం రాత్రి గంధం ఊరేగింపు జరుగుతుంది. ఈ సందర్భంగా 18న రాష్ట్ర స్థాయి బండ లాగు ఎద్దుల ప్రదర్శన పోటీలు శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సహకారంతో జరుగుతాయి. 19న ఆరు పండ్ల లోపు విభాగం ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తారు. ఇంకా జెయింట్ వీల్స్, వివిధ రకాల అంగళ్ళు ప్రజల కొరకు ఏర్పాటు చేశారు.

చౌడేశ్వరి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - బనగానపల్లి : మండల పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసిన చౌడేశ్వరి మాత నాలుగు నెలల కాలానికి సంబంధించిన హుండీ లెక్కింపు నిర్వహించారు.హుండీ లెక్కింపు కార్యక్రమం ద్వారా ఆలయమునకు 35,38,695 (ముప్పై ఐదు లక్షల ముప్పై ఎనిమిది వేల ఆరు వందల తొంబై ఐదు రూపాయలు) వచ్చినట్లు కార్యనిర్వాహ అధికారి రామానుజన్ తెలిపారు. పర్యవేక్షణ అధికారిగా పి హరిచంద్రారెడ్డి పాల్గొన్నారు. హుండీ లెక్కింపులో సత్యనారాయణ సేవా సమితి కోయిలకుంట్ల వారు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ కింద పూడికతీత

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని చిన్నబోధనం గ్రామంలోని కుంటలో అమృత్ సరోవర్ కింద పూడికతీత పనులు చేపడుతున్నట్లు ఏపీడీ సాంబశివరావు తెలియజేశారు.గ్రామంలోని కుంటను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమృత్సరోవర్ కింద చెరువులు, కుంటల్లో పూడిక తీత పనులు చేపడుతున్నామన్నారు చిన్నబోధనం గ్రామంలోని కుంటలో దాదాపు రూ. 3లక్షలతో పూడిక తీత పనులు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల పాల్గొన్నారు.

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన ధీరోదత్తుడు పొట్టి శ్రీరాములు

విశాలాంధ్ర - నంద్యాల : ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలు అర్పించిన ధీరోదాత్తుడు పొట్టి శ్రీరాములు అని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటనరీ హాలులో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘనంగా పుష్పాంజలితో నివాళులర్పించారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు. తెలుగు భాష మాట్లాడే వారందరికీ ప్రత్యేక రాష్ట్రం కావాలని అకుంఠిత దీక్షతో నిరాహార దీక్ష చేసారన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలు అర్పించిన ధీరోదాత్తుడు పొట్టి శ్రీరాములు అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ, పర్యాటకశాఖ అధికారి సత్యనారాయణ తదితరులు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద ఘనంగా పుష్పాంజలి ఘటించారు.

విశాలాంధ్ర - చాగలమర్రి : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కేసం ఆమరణ దీక్ష చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పట్టణంలోని గాంధీసెంటర్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తొమ్మంద్రు మల్లికార్జున,గుత్తి నర్సింహులు,బచ్చు వెంకటరమణ,సుబ్రమాణ్యం, బోనాధం రవి, మేడా ప్రసాద్, ప్రభాకర్, బాలక్రిష్ణ,మిట్టా రాజా,క్రిష్ణయ్య,ఎన్ఎస్ఎస్ అధికారి మహేశ్వరయ్య,తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ : ఆంధ్ర రాష్ట్రానికి పొట్టి శ్రీరాములు చేసిన సేవలు చిరస్మరణీయమని పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్ అన్నారు. గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా మండలంలోని తుడుమలదిన్నె సచివాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ 58 రోజులపాటు నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించి అమరజీవిగా నిలిచిపోయారని కొనియాడారు. డిజిటల్అసిస్టెంట్‌మౌలాలి,సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర - రుద్రవరం : అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి విద్యార్థి ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ కుమార్ అన్నారు. గురువారం మోడల్ పాఠశాల లో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయం, త్యాగం ఆయన కృషిని విద్యార్థులకు వివరించారు అమర జీవి పొట్టి శ్రీరాములు జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

విశాలాంధ్ర - పాములపాడు : గ్రామీణ విద్యార్థులు శాస్త్రీయ త పై శోధించి సాధించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని మండల తహశీల్దార్ రత్న రాధిక అన్నారు. మండల కేంద్రమైన పాములపాడులోని శ్రీ వివేకానంద విద్యా విహార్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎక్స్పో హండ్రెడ్ ప్లస్ కార్యక్రమాన్ని వపాఠశాల కరస్పాండెంట్ ఆర్ఎస్ఆర్ గోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహశీల్దార్ రత్న రాధిక, ఎంపీడీవో సుమిత్రమ్మ, వైద్యాధికారిణి నాగలక్ష్మి దేవీ సైన్స్ ఎగ్జిబిషన్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అది మాట్లాడుతూ చదువుతోపాటు శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన కలిగిన ప్పుడే విద్యార్థుల్లో ఉన్న సుజనాత్మకత బహిర్గతమవుతుం దని నగర పట్టణ స్థాయిలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులను తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగా ఇలాంటి సైన్స్ ఎక్స్పోలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని వారు తెలిపారు. మేధావులంతా గ్రామీణ ప్రాంతం నుంచి రాష్ట్ర దేశ నాయకులుగా శాస్త్రవేత్త లుగా పాలకులుగా ఎదిగిన వాస్తవాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ క్రమంలో భాగంగా గ్రామీణ నేపథ్యం ఉన్న తల్లిదండ్రులందరూ తమ పిల్లల్ని ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని అప్పుడే విద్యార్థు ల్లో విజ్ఞానం, సృజనాత్మకత పై అవగాహన పడుతుందని వారు తెలిపారు, అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన విద్య, జియాలజీ, జియోగ్రఫీ,భూ పరి పాలన విభాగం, వ్యవసా యం, కాలుష్యం, ఐక్య, నీటి ప్రాజెక్టుల నమూనా లపై వారు విద్యార్థులు నడిగి తెలుసుకున్నారు, సాంకేతిక అంశాలతో కూడుకున్న ఎన్నో ప్రాజెక్టు లను ప్రదర్శించడం ఉపాధ్యాయుల విద్యార్థుల శ్రమకు నిదర్శనం అన్నారు,చాలా సైన్స్ ఫెయిర్ కార్యక్రమాల్లో తాను పాల్గొన్నప్పటికీ ఇలాంటి వర్కింగ్ ప్రాజెక్టులపై నిశితమైన పరిశీలనతో సాంకేతిక పరిజ్ఞానం జోడించి ఎంతో చక్కగా వివారించాలన్నారు తాను బాల్యంలో చేసిన సైన్స్ ప్రాజెక్టులను ఇప్పుడు గుర్తుకు తెచ్చుకొని మళ్లీ తన బాల్యాన్ని గుర్తు చేసుకున్నానని పేర్కొన్నా రు. ఈ ప్రదర్శనలో ఉపాధ్యాయులు విద్యార్థుల కష్టం కనిపిస్తోందన్నారు. కరస్పాం డెంట్ ఆర్ ఎస్ ఆర్ గోపాల్ మాట్లాడుతూ ఈ సైన్స్ ఎగ్జిబిషన్ మూడు రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థి నీ విద్యార్థులు సందర్శించాలని ఆయన తెలిపారు. పాఠశాల అడ్మినిస్ట్రే టర్ దేవిక, ఉపాధ్యాయులు అన్వర్, సురేంద్ర, అప్సర అలీ, హబీబుల్లా. షాజహాన్, బాలకృష్ణమ్మ, జ్యోతి, మణిశ్రీ, జయలక్ష్మి ,సిరివెన్నెల,హరిత, బాలాజీ అగ్రో ఏజెన్సీ అధినేత మధుసూదన్ రావు, సామాజిక సేవకులు పుల్లన్న యాదవ్, ఆయా గ్రామాల తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రజలు, పాల్గొన్నారు.

శివనామ స్మరణతో మారు మ్రోగుతున్న నల్లమల్ల

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : ప్రతి సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీశైలంకు పాదయాత్ర గా లక్షలాదిమంది కన్నడ భక్తులు కర్ణాటక, మహారాష్ట్ర నుండి దాదాపు 650కిలోమీటర్లు పాదయాత్రగా వస్తారు. ఆత్మకూరు మీదుగా వందల సంఖ్యలో కన్నడ భక్తులు కాళ్లకు కర్రలు కట్టుకొని వాటిపై నడుస్తూ శ్రీశైలానికి బయలుదేరారు. కన్నడిగులు భక్తి నిదర్శనమని స్థానికులు పేర్కొన్నారు. వారి స్వగ్రామాలకు నుండి బయలుదేరి భక్తులు అధిక సంఖ్యలో శ్రీశైలానికి చేరుకుంటారు. ఆత్మకూరు మీదుగా వెంకటాపురం గ్రామానికి అక్కడినుంచి నల్లమల అడవి మార్గం గుండా కాలినడకన నాగ లూటి, దామర్లగుంట, పెచ్చేరువు కైలాస ద్వారం మీదుగా శంభో శివ శంకర అంటూ శివ నామస్మరణతో శ్రీశైల క్షేత్రానికి చేరుకుంటారు. శ్రీశైల క్షేత్రం అమ్మ వార్లను దర్శించుకొని శ్రీశైలం పరిసర ప్రాంతాలను నల్లమల అందాలను ఆశీర్వదిస్తారు. ఎంతో ఆహ్లాదంగా ఉండే శ్రీశైల క్షేత్రాన్ని కాలినడకన వేలాది మంది భక్తులు శ్రీశైల క్షేత్రాన్ని చేరుకుంటారు కాలినడకన వెళ్లి భక్తులకు అన్నదానతో పాటు వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపులు నిర్వహించి వారికి చికిత్సలు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్రానికి ఆడపడుచు అయిన భ్రమరాంబ దేవి ఒడిబియ్యం పెట్టిన అనంతరం భక్తులు తిరిగి వారి స్వగ్రామాలకు వెళ్లి ఉగాది పండుగను ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరంలాగే భక్తులు ఈ ఉగాది పండుగకు పెద్ద సంఖ్యలో కాలినడకతో దారివెంట వారి ప్రయాణాన్ని కొనసాగిస్తూ ఓం నమ శివాయ శివాయ నమః అంటూ శివ నామ స్మరణతో మారుమ్రోగిస్తూ వారి భక్తి శ్రద్ధలను ఎంతో చాటుకుంటున్నారు. దారివెంట భక్తులకు మంచినీరు మజ్జిగ అందించడంతో ఎండ తీవ్రత నుండి వారికి కొంత ఉపశమనం కలిగిస్తుండడం అలసట వేసినప్పుడు అక్కడక్కడ చల్లటి చెట్టు నీడలో సేదతీరుతూ వారి పాదయాత్రను భక్తులు కొనసాగిస్తున్నారు.

తప్పొప్పులుంటే సరిచేసుకోండి

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలో రబీ పంట కాలానికి సంబంధించి ఈ పంట నమోదు చేసుకున్న రైతులు వాటి జాబితాలో ఏదైనా తప్పొప్పులుంటే ఈనెల 17లోపు సరి చేసుకోవాలని ఏవో రంగనేతాజీ తెలియజేశారు. మండలంలోని పెద్దబోధనం గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రంలో సామాజిక తనిఖీలో ఉంచిన జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ పంట నమోదులో ఏవైనా తప్పులుంటే గుర్తించి వెంటనే రైతు భరోసా కేంద్రాల్లో సరి చేసుకోవాలని సూచించారు.

ఈ క్రాప్ వల్ల అధిక ప్రయోజనాలు

విశాలాంధ్ర - శిరివెళ్ళ : ఆహార ధాన్యాలు అందించే అన్నదాతలు ఈ క్రాప్ నమొదు చేసుకోవడం వల్ల అధిక ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రావు సూచించారు. మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామంలో గల రైతు భరోసా కేంద్రంలో 2022-23 రబి సాగు ఈ పంట నమోదు వివరాలను అయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి ఈ సుధాకర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదుపై అభ్యంతరాలు ఉంటే తక్షణమే రైతు భరోసా కేంద్రాల్లో తెలపాలని ఈనెల 17వ తేదీ లోపు రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నట్లయితే 20వ తేదీ లోపల పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జొన్న పంటకు సంబంధించి రు.2910 మద్దతు ధర ప్రకటించిందని ఎవరైనా రైతులు తమ జొన్న పంటను ప్రభుత్వానికి విక్రయించాలంటే సంబంధిత ఆర్బికేల వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రతాప్ రెడ్డి, రైతుబరోషా వ్యవసాయ, సిబ్బంది, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ ఆలయ హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - నంద్యాల రూరల్ : నంద్యాల జిల్లా కేంద్రంలోని వెలసిన ఆంజనేయ కోదండ రామస్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం తిరుమల బాలాజీ సేవా గ్రూప్స్ అలాగే వాసవి కన్యకా పరమేశ్వరి గ్రూప్ సమక్షంలో ఆంజనేయ ఆలయ హుండీ లెక్కింపు ప్రక్రియ నిర్వహించి నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి రామాంజనేయ శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 నెలల నుండి వచ్చిన ఆదాయం అన్నదానం హుండీకి 60వేల722 రూపాయలు శాశ్వత హుండీకి 4లక్షల 79వేల750 రూపాయలు భక్తులు సమర్పించడం జరిగిందన్నారు. ఆంజనేయ కోదండరామ స్వామి దేవాలయానికి భక్తులు సమర్పించిన కానుకలు మొత్తం 5లక్షల 40వేల 472రూపాయలు వచ్చేయన్నారు. లెక్కింపు కార్యక్రమము 2022 ,నుండి 2023 16వ తేదీ నాటికి ఈ ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు. గత సంవత్సరం 5 లక్షల27వేల 284రూపాయలు భక్తాదులు సమర్పించారని ప్రస్తుతం గత సంవత్సరం కంటే ఈ సంవత్సరము 13 వేల188 రూపాయలు ఆదాయం వచ్చిందని ఆయన మీడియాకు తెలియజేశారు. హుండీ లెక్కింపు కార్యక్రమానికి తనిఖీ అధికారిగా వేణు నాదరెడ్డి, అర్చకులు సుబ్బయ్య, ఆధ్వర్యంలో నిర్వహించామని ఆలయ కార్యనిర్వాధికారి రామాంజనేయశర్మ ఈ సందర్భంగా తెలియజేశారు. లెక్కింపులో ఆలయ సిబ్బంది, దేవాలయ కమిటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - డోన్ రూరల్ : క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శాంతిరాం మెడికల్ కాలేజీ, జనరల్ వారి సహకారంతో స్థానిక షాధిఖానాలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ కమిటీ సభ్యులు జాన్సన్ బాబు, ఆదాం, యిర్మియా, ప్రవీణ్‌కుమార్‌లు మాట్లాడుతూ శాంతిరాం మెడికల్ కాలేజ్ వారి సహకారంతో ఎంతో అనుభవం కలిగిన వైద్యులతో వివిధ రకాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారని అందులో ప్రధానంగా కంటి పరీక్షలు, రక్త పరీక్షలే కాకుండ బీపి, షుగర్ ఇసిజి, ఎముకలు కీళ్ల వ్యాధుల పరీక్షలు నిర్వహించి అయా వ్యాధులకు మందు లు చేశామని తెలిపారు. అంతే కాకుండా కంటి ఆపరేషన్ అవసరమైన వారికి శాంతిరాం మెడికల్ కాలేజీలో ఆరోగ్యశ్రీ కార్డు క్రింద ఉచితంగా ఆపరేషన్లు నిర్వహి స్తారని తెలిపారు. ఆపరేషన్ అవసరమైన వారికి నంద్యాల శాంతిరాం వైద్యాశాలలో ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తారని ఇందుకు గాను ఆధార్ కార్డు రేషన్ కార్డు ఆరోగ్యశ్రీ కార్డు బ్యాంక్ అకౌంట్ కలిగి ఉండాలని తెలిపారు.

వైసీపీ ఎమ్మెల్సీగా మధుసూదన్ గెలుపు

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు నియోజకవర్గం అల్లూరు గ్రామానికి చెందిన అల్లంపూర్ డాక్టర్ మధుసూదన్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయడం జరిగింది. అయితే గురువారం కర్నూల్ లోని సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రాంగణం నందు ఓట్ల కౌంటింగ్ లెక్కింపు ప్రక్రియను ప్రారంభించగా వైసీపీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ 988ఓట్లతో గెలుపొందడం జరిగింది. దీంతో నందికొట్కూరు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అల్లూరు గ్రామస్తులు అధిక సంఖ్యలో కర్నూలుకు చేరుకొని డాక్టర్ మధుసూదన్ కు పూల బొకే అందజేసి పూలదండలు వేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ నా గెలుపుకు కృషి చేసినటువంటి ఏపీ షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ నియోజకవర్గ జడ్పీటీసీలు, పిటిసిలు, కౌన్సిలర్లకు,వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అరటిలో చెలరేగిన మంటలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని మదనంతపురం గ్రామ సమీపంలోని అరటి తోటలో చెలరేగినాకస్మిక మంటలకు పంట కాలిపోయింది. వివరాల మేరకు గ్రామానికి చెందిన నంద్యాల గంగయ్య రెండు ఎకరాలలో అరటిని సాగు చేశాడు. రెండవ సంవత్సరం పంట ఐనా అరటి దిగుబడిని కొద్ది మేర పంటను వ్యాపారులకు ఇటీవలే విక్రయించాడు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న మిగిలిన అరటి గురువారం మధ్యాహ్నం తోటలో ఆకస్మికంగా చెలరేగిన మంటలతోఎకరం పంట దెబ్బతింది. దాదాపు 10 టన్నుల మేర అరటి గెలలు కాలిపోయినట్టు బాధిత రైతు గంగయ్య తెలిపారు. అరటి గెలలతో పాటు, నీటి పైపులు, డ్రిప్పు పైపులు మంటలకు కాలిపోయాయి. చుట్టుపక్కల రైతులు వచ్చి తోటలో చెలరేగిన మంటలను ఆర్పి వేసి మిగిలిన పంటను కాపాడారు. దాదాపు రు2 లక్షల మేర నష్టం వాటిల్లినదని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

మిరప పంట పొలంలో పంట కోత ప్రయోగం

విశాలాంధ్ర - సి.బెళగల్ : రైతు వేసిన మిరప పంట పొలములో మండల వ్యవసాయ అధికారి జి మల్లేష్ కుమార్ పర్యవేక్షణ అధికారిగా హాజరై పంటకోత ప్రయోగాన్ని నిర్వహించారు. గురువారం మండల పరిధిలోని చింతమానుపల్లె గ్రామంలో హెూసూరు సరోజమ్మ అనే రైతు పొలంలో వేసిన మిరప పంటలో పంటకోత ప్రయోగాన్ని నిర్వహించి వ్యవ సాయ అధికారి మల్లేష్ కుమార్ మాట్లాడుతూ మిరప పంట లో ఐదు ఇంటూ ఐదు విస్తీర్ణంలో 16కేజీల 500 గ్రాముల పంట దిగుబడి వచ్చిందని ఈ ప్రకారం 22 లేదా 23 క్వింటాళ్ల దిగుబడి పంట వస్తుందని అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది మరియు వివిఏ ప్రవీణు, రాజారెడ్డి, తలారి వెంకట్రాముడు రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీగా ఉంది

- సాగునీటి ప్రాజెక్టులకు మొండి చెయ్యి చూపారు
- అభివృద్ధిని విస్మరించారు
- జిల్లాకు తీవ్ర అన్యాయం
- సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య

విశాలాంధ్ర - కర్నూలు : రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశపెట్టిన 2.79లక్షల కోట్లబడ్జెట్ అంకెల గారిడిగా ఉందని, ప్రజలను వంచించే విధంగా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అన్నారు. బడ్జెట్లో సంక్షేమానికి నవరత్నాలకు నిధుల కేటాయింపులు చేసి నప్పటికీ అభివృద్ధిని పూర్తిగా విస్మరించినట్లు స్పష్టంగా అర్థమవుతుందని, సంక్షేమానకి,అభివృద్ధికి సమానంగా చూడాల్సిన అవసరం ఉందని, సాగునీటిపారుదల ప్రాజెక్టులకు, వ్యవసాయానికి అరకొర నిధులు కేటాయింపులు చేసి చేతులు దులుపుకున్నారని, ఆర్థికశాఖ మంత్రి చెప్పేదానికి, ఆచరణకు పొంతనలేదని, వెనుకబడిన రాయలసీమ, కర్నూలు జిల్లాలో ఉన్న వేదవతి, గుండ్రేవులప్రాజెక్టు, ఆర్డీఎస్ కుడికాలువ, సిద్దేశ్వరం అలుగు, తదితర సాగునీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులు చేయకపోవడం చాలా బాధాకర మని, నాలుగు సంవత్సరా లుగా సాగునీటిపారుదల ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని దీని కారణంగా వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి, కర్నూలు జిల్లాకు,సాగునీరు ప్రశ్నార్థకమవుతుందని, ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం ఆదోని పత్తి కొండ డివిజన్లు పూర్తిగా వెనుకబడిన చామ పీడిత ప్రాంతాలుగా ఉన్నాయని ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటా యింపులు లేకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు.తక్షణమే ఈ బడ్జెట్లో సవరణలు చేసి సాగునీటి పారుదల ప్రాజెక్టులకు 15% శాతం పశ్చిమ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయిం చాలని ఆయన డిమాండ్ చేశారు.

సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర - మంత్రాలయం : నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయ ంలోని ఆయా గ్రామాలలో ఉన్నటువంటి సచివాలయాలలో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి. విజయభాస్కర్ యాదవ్ అన్నారు. గురువారం మాధవరం గ్రామం సచివాలయాన్ని గురువారంసచివాలయంలోనికి వెళ్లగా మధ్యాహ్నం 12:30 గంటల సమయమైన పంచాయతీ కార్యదర్శి రాకపోవడం విడ్డూరమని ఆయన అన్నారు. రైతులకు అటు ప్రజలకు సచివాలయాల ద్వారా ఎన్నో సేవలు చేయాలని సీఎం జగన్మోహన్ రెడ్డి చెప్పినప్పటికీ సచివాలయం సిబ్బంది మాత్రం సమయపాలన పాటించుకోకుండా రైతు సమస్యలు పట్టించుకోకుండా కాలక్షేపం చేస్తున్నారే తప్ప సమయపాలన మాత్రం పట్టే పాటించడం లేదని వారన్నారు. కావున సంబంధిత అధికారులు సచివాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు . సీపీఐ నాయకులు సత్యన్నా సీపీఐ కార్యకర్తలు నాయకులు ఉన్నారు.

పెట్రోల్ లేక ఇబ్బందులు

విశాలాంధ్ర - హెూళగుంద : హనుమంత్ రెడ్డి ఫీలింగ్ స్టేషన్లో నాలుగు రోజుల నుండి పెట్రోల్ డీజిల్ ఆయిల్ సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు పెట్రోల్ బంకు ద్వారా ఇంధనం పొంది ప్రజలు భక్తులు ఎల్లార్తి షేక్షావలి శేషావలి దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి దర్శనం కోసం అధిక సంఖ్యలో తరలివెళ్లతారు. ఆదోని ఆలూరుకు వెళ్లాలన్న ఇదే పెట్రోల్ బంక్ ద్వారా ఇంధనం వాహనాల్లో నింపుకొని ప్రయాణిస్తుంటారు. పెట్రోల్ సరఫరా లేదంటూ సిబ్బంది వాహన యజమాను లకు చెప్పడంతో వాహన యజమానులు ఉసూరు మంటూ వెనుతిరిగి వెళ్ళిపోతున్నారు. పెట్రోల్ డీజిల్ ఆయిల్ అందు బాటులో ఉంటే ట్రాక్టర్ లారీ ఆటో తదితర వాహనాలు నడపడానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని వాహనాల యజమా నులు తెలిపారు. ఎంతో దూర ప్రాంతాల నుండి వచ్చామని పెట్రోల్ డీజిల్ ఆయిల్ అందుబాటులో లేకపోతే ఎలా అని వాహన యాజమానులు ప్రశ్నించారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పెట్రోల్ బంక్లో సక్రమంగా డీజిల్ పెట్రోల్ ఆయిల్ సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. పెట్రోల్ బంక్ మేనేజర్ రాఘవేంద్రను సంప్రదించగా బ్యాంక్ అకౌంట్ లాక్ అయినందున సమస్య ఏర్పడిందనిరెండు రోజుల్లో ప్రజలకు ఇంధన సరఫరా చేస్తామని అన్నారు.

ముళ్లపొదలు తొలగింపు

విశాలాంధ్ర - హెూళగుంద : మండలంలోని కోకిల తోట రోడ్డు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ళ కంపును సర్పంచ్ గురుపాదమ్మ ఆధ్వర్యంలో జీసిపి యంత్రం ద్వారా తొలగించారు సర్పంచ్ గురుపాదమ్మ తనయుడు నాగప్ప మాట్లాడుతూ గ్రామములో రెండు రోజులపాటు సుంకులమ్మదేవి మారెమ్మ దేవి దేవర కుంభోత్సవ కార్యక్రమం జరుగు తుందని అందుకోసం భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో తరలి వస్తారని అన్నారు గ్రామానికి వచ్చే నాలుగు రోడ్ల లో ఇరు వైపుల విపరీతంగా పెరిగిన ముళ్ళ చెట్లను కంపలను మొద్దులను తొలగించి ప్రజల రాకపోక లకు ఇబ్బంది లేకుండా చేశామని అన్నారు ముళ్ళకంపు తొలగించడంతో పెద్ద సమస్యతీరిందని రాకపోకలకు సులభం అయిందని ప్రజలు తెలిపారు ముళ్ల కంపలను తొలగించడం వల్ల రోడ్డు వెడల్పుగా మారిందని వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోయిందని వాహనాల యజమానులు పేర్కొన్నారు గ్రామానికి కోటి 85 లక్ష రూపాయలతో బీటీ రోడ్డు పనులు పూర్తి కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

గద్దెరాళ్ళ మారెమ్మవ్వ హుండి లెక్కింపు

విశాలాంధ్ర - దేవనకొండ : గద్దెరాళ్ళ శ్రీ మారెమ్మవ్వ దేవర హుండి గురువారం లెక్కించడం జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేకర్రెడ్డి సమక్షంలో ఆలయ పరిసర ప్రాంతంలో దేవరలో వచ్చి హుండి లెక్కించగా ఆదాయం రూ.14 లక్షల 66వేలు వచ్చిన్నట్లు తెలిపారు.గత ఏడాది కంటే అధికంగా రూ.3 లక్షల17 వేలు ఆదాయం వచ్చిన్నట్లు ఈఓ తెలిపారు.లెక్కింపులో సిబ్బంది శ్రీనివాసులు ,పోలీసు సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న రాయలసీమ శకుంతల

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాయలసీమ మహిళా సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాయలసీమ శకుంతల సామాజిక సేవలకు గాను, కడపకు చెందిన ప్రముఖ న్యాయవాది మనం ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు కే.చక్రవర్తి రాయలసీమ సేవా రంగంలో అందించే ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ గ్లోరీ అవార్డు 2023ని అందించారు. ఈ సందర్భంగా రాయలసీమ శకుంతల మాట్లాడుతూ.. గత 15సంవత్సరాల నుండి సామాజిక సేవలో పాల్గొంటూ...నిరాశ్రయులకు, ఆడవాళ్లకు, వృద్ధులకు, భర్త, అత్తా వేధింపులతో వచ్చిన మహిళలకు కౌన్సిలింగ్ ఇవ్వడం. ప్రభుత్వ కార్యక్రమాలలో కూడా పాల్గొంటూ.. వారికి ప్రభుత్వ నుండి వచ్చే పథకాలను వారికి తెలియజేసి ఇప్పించడం. నేను చేసే సేవలకు చాలా అవార్డులు వచ్చాయి. ఇంటర్నేషనల్ గ్లోరీ అవార్డుకు ఎంపిక చేసిన మనం ఫౌండేషన్ చక్రవర్తికి ధన్యవాదములు తెలుపుతూ... ఇలాంటి అవార్డులతో ఇంకా ఉత్సాహంతో పనిచేసి అందరి సహాయ సహకారాలతో మరిన్ని సేవలు చేయాలని కోరుకుంటున్నానన్నారు.

జూనియర్ న్యాయవాది గుండెపోటుతో మృతి

విశాలాంధ్ర - కర్నూల్ లీగల్ : కర్నూల్ బారసోసియేషన్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ గురువారం గుండెపోటుతో రామకృష్ణ వయసు 37ప్రతిరోజు బ్రాహ్మణకొట్కూర్ నుంచి కర్నూల్కు వచ్చి ప్రాక్టీసింగ్ చేసుకుంటూ జీవనం కొనసాగించేవారు చిన్న తనంలోనే న్యాయవాది కోల్పోవడం బాధాకర విషయమని కర్నూల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎమ్మార్. కృష్ణ ప్రధాన కార్యదర్శి కె.రంగడు, భారత న్యాయవాదుల సంఘం ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రంగనాథ్, బివిఎస్.రవికాంత్ ప్రసాద్, పి.దస్తగిరిలు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

జంట హత్య కేసులో నిందితులు అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : జంట హత్యకేసులో నిందితులను అరెస్టుచేసి రిమాండ్కు తరలించినట్లు కర్నూలు నాలుగవపట్టణ పోలీసుస్టేషన్ సీఐ శంకరయ్య తెలిపారు. గురువారం నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్లో ఆయన పాత్రికేయు లతో మాట్లాడుతూ కల్లూరు మండలం చింతల మునినగర్లో నివాసం ఉంటున్న నారపురం శ్రావణ్కుమార్ తెలంగాణ రాష్ట్రం, వనపర్తి జిల్లా, టౌన్కు చెందిన కొత్త రుక్మిణీకి మార్చి 1న వివాహం జరిగింది. ఆరోగ్య కారణాల దృష్ట్యా వారిద్దరికి శోభనం జరగలేదు. దానికి వధువు అయిన కొత్త రుక్మిణీ, ఆమె తల్లితండ్రు లు కొత్త వెంకటేష్, కొత్త రమాదేవి అను వారు సదరు శ్రావణ్కు మగతనం లేదని, తమ బిడ్డ

గొంతు కోశారని సదరు శ్రావణ్, అతని తల్లితండ్రులు వరప్రసాద్, కృష్ణవేణిలతో గొడవపడ్డారని తెలిపారు. ఈ విషయం మనసులో పెట్టుకొని రుక్మిణీకి ఎవరితోనో అక్రమ సంబంధం ఉందని ముద్దాయిలైన శ్రావణ్, అతని తల్లితండ్రులు ప్రసాద్, కృష్ణవేణిలను అవమాన పరిచినారన్నారు. తరువాత ముద్దాయి శ్రవణ్ హైదరాబాద్లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో సున్తి చేయించుకొన్నాడన్నారు. ఈ విషయం గురించి తన భార్య రుక్మిణీ, ఆమె తల్లితండ్రులకు చెప్పినా వారు నమ్మలేదన్నాడు. అదే సమయంలో ముద్దాయి వరప్రసాద్, తన కోడలు ఆమె తల్లితండ్రులు కలిసి, తన కొడుకుకు ఏదో చేశారని అపోహ పడి, రుక్మిణీ, ఆమె తల్లితండ్రులు వెంకటేష్, కొత్త రమాదేవిలను ఎలాగైనా చంపాలని నిర్ణయించు కొని, వారి ప్లాన్ ప్రకారం ఈనెల 14న ఉదయం ముద్దాయి శ్రవణ్ తన భార్య కొత్త రుక్మిణీ, తల్లిదండ్రులు కొత్త రమాదేవి,కొత్త వెంకటేష్, చింతలముని నగర్లో ఉన్న తన ఇంటి వద్దకు పిలుచుకొని వచ్చాడని తెలిపారు. వారి ప్లాను ప్రకారం అప్పటికే వరప్రసాద్, చెన్నమ్మ సర్కిల్లో ఉన్న ఆంధ్ర ప్యారిస్ మాల్లో రెండు కత్తులను కొనుగోలు చేసి ఉన్నాడు. రుక్మిణీ,ఆమె తల్లితండ్రులు కొత్త రమాదేవి, కొత్త వెంకటేష్ లు తన ఇంటి వద్దకు రాగానే, ముద్దాయిలైన శ్రావణ్కుమార్, అతని తండ్రి నారవరపు వరప్రసాద్ అనువార్లు, ముద్దాయి కృష్ణవేణిని బయట కాపలాగా ఉంచి, కొత్త రుక్మిణిని కింది అంతస్తులో ఉన్న గదిలో, ఆమె తల్లి తండ్రులు కొత్త రమాదేవి, కొత్త వెంకటేష్లను మొదటి అంతస్తులో ఉన్న గదిలో ఇష్టం వచ్చినట్లు కత్తులతో పొడవగా, కొత్త రుక్మిణి ఆమె తల్లి కొత్త రమాదేవిలు అక్కడికక్కడే చనిపోయినట్లు తెలిపారు. కొత్త వెంకటేశ్ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుచున్నాడని తెలిపారు. గాయ పడిన కొత్త వెంకటేష్ ఫిర్యాదు మేరకు,శ్రావన్, ఆయన తండ్రి ప్రసాద్, తల్లి కృష్ణవేణిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం గుత్తి పెట్రోల్ బాంకు వద్ద అరెస్టు చేయటం జరిగింది. వారి వద్ద నుండి నేరం చేయుటకు ఉపయోగించిన 2కత్తులను, రక్తం అంటిన బట్టలను స్వాధీనం చేసుకొవడం జరిగింది. వారిని రిమాండు నిమిత్తం ఏఎంసీ కోర్టు వారి ముందు హాజరు పరుచబడును.

వైఎస్సార్ భీమా పథకం పేదలకు వరం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : వైఎస్సార్ భీమా పథకం పేదలకు వరం లాంటిదని గ్రామ సర్పంచ్ కృష్ణ గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మేకడోన గ్రామంలో క్యాన్సర్ బారిన పడి మృతి చెందిన కురువ అయ్యన్న భార్యకు వైఎస్సార్ భీమా పథకం కింద తక్షణ సహాయం కింద 10 వేల రూపాయలు నగదును గ్రామ సర్పంచ్ కృష్ణ గౌడ్, సచివాలయ కన్వీనర్ నాగేంద్రగౌడ్, జావిద్,వెల్ఫేర్ అసిస్టెంట్ సలీమ్ అందజేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ మృతుడు చిన్న అయ్యన్న కుటుంబానికి వైఎస్సార్ భీమా పథకం కింద లక్ష రూపాయలు ఆర్థిక సహాయం లభిస్తుందన్నారు. మొదటి విడత కింద 10వేల రూపాయలు నగదును అందజేశామని, మిగిలిన 90వేల రూపాయలు నామినీ బ్యాంకు ఖాతాకు జమ చేయడం జరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ వీరేష్ పాల్గొన్నారు.

22న వల్లెలంబాదేవి రథోత్సవం

విశాలాంధ్ర - కోడుమూరు : పట్టణ శివారులోని హంద్రీనది ఒడ్డున వెలసిన చదువుల తల్లి వల్లెలంబాదేవి ఆలయం వద్ద ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారి రథోత్సవ వేడుకలు నిర్వహించేం దుకు ఘనంగా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జడ్పిటిసి బరుసు రఘునాథరెడ్డి తెలిపారు.ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయన ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఉగాది ఉత్సవాల వేడుకల కరపత్రాల తోపాటు ఆలయం వద్ద కోట్ల హర్ష యూత్ సభ్యులు నిర్వహించే జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు,ముగ్గుల పోటీలు తదితర సాంస్కృతిక కార్యక్రమాల కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఈనెల 21నుంచి 23వ తేదీ వరకు అమ్మవారి ఆలయం వద్ద ఉగాది ఉత్సవ సంబరాలు ఘనంగా జరుగుతాయన్నారు. 21న ఉదయం నుంచి గోపూజ,గణపతి పూజ, పుణ్యాహవాచనం,గంగ పూజ తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతిరోజు సాయంత్రం ప్రభోత్సవం ఉంటుందన్నారు. 22వ తేదీ బుధవారం సాయంత్రం అమ్మవారి మహారథోత్సవం నిర్వహిస్తామన్నారు. 23న సింహ వాహనంపై పారువేట,అనంతరం వసంతోత్సవం కార్యక్రమాలు ఉంటా యన్నారు.భక్తులందరూ అమ్మవారి ఉత్సవ కార్యక్రమాలలో పాల్గొని ఆశీస్సులు పొందగలరని కోరారు. సింగిల్ విండో కన్వీనర్ కృష్ణారెడ్డి,కరెంటు మల్లారెడ్డి,రమేష్ నాయుడు,సాలప్ప,వెంకటేష్ పాల్గొన్నారు.

వెలుగులో అవినీతి దేగలు !

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో ఆనాడు ప్రభుత్వాలు మహిళలకు పొదుపు లక్ష్మి గ్రూపులను ప్రవేశపెట్టి తక్కువ వడ్డీ బ్యాంకు రుణాలు అందజేసి చిరు వ్యాపారాలు చేసుకునేం దుకు అవకాశాలు కల్పించారు. నిరక్షరాస్యులుగా ఉన్న మహిళలను ఆసరాగా తీసుకుని బ్యాంకులకు చెల్లించాల్సిన నెలవారీ కంతులను వెలుగు సిసి, గ్రామ బుక్ కీపర్లు కుమ్మక్కై చేప కింద నీరులా అవినీతి పాకి పోయింది. వివిధ ప్రాంతాల్లో వెలుగులో కుంభకోణాలు వెలుగు చూస్తున్న తరుణంలో భాగంగా మండలంలోని పెద్ద తుంబలం గ్రామంలో దాదాపు 130పొదుపు లక్ష్మి గ్రూపులు ఉండగా 6గ్రూపులకు సంబంధించిన నెల కంతులు ఒక్కొక్క గ్రూప్కి సంబంధిం చిన రూ.30వేలు దాదాపు లక్ష 80వేలు అవినీతికి పాల్పడినట్లు ఆయా గ్రూప్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద తుంబలం గ్రామంలో ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో ఖాతాలు ఉండడంతో నిరక్షరాస్యులైన మహిళలు కంతు చెల్లించేందుకు బ్యాంకుకు వెళితే అక్కడ తిష్ట వేసుకొని కూర్చున్న సిసి, బుక్ కీపర్లు వారి అతి తెలివిని ఉపయోగించి గ్రామైక్య సంఘంలోకి ఒక నెల కంతు ను మళ్లించుకుని డ్రా చేసి వాటాలు పంచుకున్నారని ఆయా గ్రూప్ సభ్యులు ఆరోపిస్తున్నారు. దొడ్డి దారిన అక్రమాలకు పాల్పడుతున్నారంటే ఏపిఎం అధికారికి కూడా వాటాలు అందుతుంటాయని గ్రామస్తులు ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు. కాయకష్టం చేసుకుని కుటుంబం గడుస్తూ నెలసరి కంతు చెల్లించాలంటే మహిళల కష్టార్జితం అంతా ఇంతా కాదండోయ్... బ్యాంకు అధికారులు సిసి,బుక్ కీపర్ లేకుండా గ్రూప్ లీడర్లకు, సభ్యులకు బ్యాంక్ లోన్ ఇవ్వమని కళాఖండగ చెప్పేస్తున్నారు. సీసీ,బుక కీపర్ వెంటపడి లోన్ మంజూరు చేయించుకుంటే ఒక్కో సభ్యురాలు లోన్ అమౌంట్ను బట్టి కమిషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇటువంటి దౌర్భాగ్య పరిస్థితి పొదుపు లక్ష్మి గ్రూపులలో దాగి ఉందంటే ఎవరైనా నమ్మగలరా... పెద్ద తుంబలం గ్రామంలో ఇటువంటి సంఘటనలు విచారణ చేపడితే మరెన్నో వెలికి తీయవచ్చు. పెద్ద తుంబలం గ్రామ పొదుపు లక్ష్మి గ్రూప్ సభ్యులు వెలుగు కార్యాలయం త్వరలో ముట్టడించేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. పై అధికారులు మేల్కొంటారా కంటి తుడుపు చర్యగా వదిలేస్తారా వేచి చూడాల్సిందే.

అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి : సిద్ధప్ప తాత గ్రూప్ లీడర్ జయతుంబీ, పెద్ద తుంబలం : పొద్దునగా పనికి పోయి సాయంకాలం వస్తే రూ.200 దినసరం వేతనం పొందుతాం.. ఇప్పుడు పెరుగుతున్న ధరలకు మా వేతనం సరిపోక కుటుంబం గడవడమే కష్టంగా ఉంది. నెలసరి పొదుపు లక్ష్మి కంతు చెల్లించలేక ఇబ్బందులు పడుతూ అనారోగ్యాలకు గురవుతున్నాము. అవినీతికి పాల్పడిన వారిపై కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలి.

విచారణ చేస్తాం. వెలుగు ఏపిఎం జనార్ధన్ : పెద్ద తుంబలం గ్రామంలో పొదుపు లక్ష్మి గ్రూపులలో జరిగిన అవినీతిపై త్వరలో పూర్తిస్థాయిలో విచారణ చేపడతాము. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాము.ప్రస్తుతం నేను లీవ్లో ఉన్నాను.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైసీపీ విజయం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైసీపీ బలపరచిన డా. అలంపురం మధుసూదన్ భారీ మెజారిటీ తో విజయం సాధించారు. గురువారం నగరంలోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కాలేజిలో లెక్కింపు నిర్వహించారు.స్థానిక సంస్థల ఎన్నికలలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 1178 ఓట్లు ఉన్నాయి. ఇందుకు గాను వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ మధుసూధన్, పోటీ చేయగా ఇండిపెండింగ్లుగా ఎన్ మోహన్రెడ్డి, భూమా వేణుగోపాల్రెడ్డి లు పోటీ నిలిచారు. ఈనెల 13వ తేదిన పోలింగ్ జరిగింది.ఈ పోలింగ్లో కర్నూలు, నంద్యాల జిల్లాలోని ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్, కార్పొరేట ర్లు మొత్తం 1136 మంది తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. గురువారం ఉదయం 9గంటల కు ఓట్ల లెక్కింపు ప్రారంబించారు. వైసీపీ అభ్యర్థి డా ఎ మదుసూధన్కు 988, ఎన్ మోహన్రెడ్డికి 95 భూమా వేణుగోపాల్రెడ్డికి ఓట్లు రాగా 53 ఓట్లు చెల్లకుండా పోయాయి. మొత్తం వైసీపీ ఓట్లు 1021 ఓట్లకు గాను 988 ఓట్లు రాగా, టీడీపీ 129 ఓట్లకు గాను 95 ఓట్లు పోలైనాయి. విజయం సాధించిన డాక్టర్ ఎ మధుసూధన్కు జేసీ రాంసుందర్రెడ్డి డిక్లరేషన్ ఫారం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఎమ్మెల్యే వై సాయిప్రసాద్రెడ్డి, కర్నూలు నగర మేయర్ బివై రామయ్య పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : సమాచార చట్టం అవగాహన కొరకు నిధులు కేటాయించాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్ జిల్లా రిప్రెజెంటివ్ బొగ్గుల తిక్కన్న అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ ప్రభుత్వ పనితీరులో పారదర్శ కత ఉద్యోగు లలో జవాబుదారీ తనం ప్రజాహిత కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం ద్వారా అవినీతిని అరికట్టి, దాప రికం లేని పాలనా వ్యవస్థను అందించాలనే సదుద్దే శంతో కేంద్ర ప్రభుత్వం 2005అక్టోబర్ 12న సమా చార హక్కు చట్టం తెచ్చిందన్నారు. చట్టం వచ్చి 18సంవత్సరాలు కావస్తున్న ప్రజలకు ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల వారు అర్థం చేసుకో వడం కష్టం అవుతుందని తెలిపారు. కావున ప్రభుత్వం చట్టంలోని సెక్షన్ 26లో చైతన్య సదస్సుల ద్వారా చట్టాన్ని ఎలా ఉపయోగించుకోవాలో ప్రజల్లో అవగాహన కల్పిం చాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడున్నర ఏళ్లలో అధికారుల కోసం గానీ, ప్రజల కోసం గానీ నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు నామ మాత్రమే అన్నారు. అది కాగితా లకే పరిమితమైందన్నారు. నేడు అన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతి రాజ్యమేలు తుందని డబ్బులు ఇవ్వందే ఏ పని జరగడం లేదని విమర్శి ంచారు. సమాచార చట్టం ద్వారా పారదర్శకత, జవాబుదారీ తనం పెంచేం దుకు ప్రజలతో చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే సమాచార హక్కు చట్టం అవగాహన కల్పించేందుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ నిబంధన అతిక్రమిస్తే చర్యలు

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో గీతా వాణి హెచ్చరించారు. గురు వారం మండలంలోని జి.హెూసళ్ళి,ఇస్వి గ్రామాలలోఎంపీయుపి స్కూల్స్, అంగన్వాడీ కేంద్రాలను పర్యవేక్షిం చారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపించకుండా మెనూ ప్రకారం విద్యార్థులకు వడ్డించా లని మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు సూచించారు. అంగన్వాడి కేంద్రా లలో గర్భిణీలకు,బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వం ఇస్తున్న నిర్ణీత గడవలోపే పౌష్టికాహారాన్ని అందజేయాలని సూచించారు. సచివాలయం లో, సచివాలయ సిబ్బంది వాలంటీర్లతో సమావేశాన్ని నిర్వహించి పలు విషయాలు తెలియజేశారు.ఆమెతోపాటుమండల విద్యాధికారి శివరాము లు, సీనియర్ పంచాయతీకార్యదర్శులునాగరాజు,చంద్రశేఖర్ ఉన్నారు.

ట్రై సైకిల్ లేక ఇబ్బందులు

విశాలాంధ్ర - హెూళగుంద : మండలం లోని ఎల్లార్తి గ్రామానికి చెందిన కురువ పోతన్న ఈరమ్మ దంపతుల మొదటి కుమారుడు హెచ్.లక్ష్మీకాంతకు పుట్టుకతో కాళ్లు చచ్చుబడ్డాయి. విద్యార్థి లక్ష్మీకాంత్ హెూళగుంద ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యారు. ఎల్లార్తి గ్రామం నుండి రోజు తీవ్ర ఇబ్బంది పడుతూ కాలేజీకి హాజరై చదువుకుంటున్నాని విద్యార్థి తెలిపారు. కాళ్లు చచ్చుబడి వికలాంగులుగా మారానని ట్రై సైకిల్ కోసం ఆదోని కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని విద్యార్థి తల్లి దండ్రులు ఆరోపించారు. 3000రూపా యలు పెన్షన్ వస్తుందన్నారు. ట్రై సైకిల్ ఉంటే రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ట్రై సైకిల్ లేనందున అతి కష్టం మీద నడుస్తున్నానని ఎన్నోసార్లు కిందపడి గాయపడ్డానని విద్యార్థి లక్ష్మీకాంత్ పేర్కొన్నారు. సంబంధిత స్నేహితులు సహాయంతో వాహనాలు ఎక్కుతానని దిగుతానని మెట్లు ఎక్కాలన్న గగనంగా ఉంటుందన్నారు. చేతిలో చేతి కర్ర లేకపో వడం కూడా కష్టంగా ఉన్నదని అన్నారు. అధికారులు దాతలు స్పందించి ట్రై సైకిల్ మంజూరు చేయాలని విద్యార్థి లక్ష్మీకాంత్ విజ్ఞప్తి చేశారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : మార్చి 16 ఆంధ్రరాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం నేటి తరానికి ఆదర్శం కావాలని, ఆయన ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరు కూడా కృషి చేద్దామని అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర రావు అన్నారు. గురువారం కార్పొరేషన్లోని కౌన్సిల్ హాలులో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ ఎస్.వి.రమాదేవిలు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఇంచార్జి సిటి ప్లానర్ మోహనుకుమార్, మేనేజర్ చిన్నరా ముడు, అసిస్టెం ట్ సిటి ప్లానర్ రంగస్వామి,ఉద్యోగులు, పాల్గొన్నారు.

పత్తికొండ : పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో, మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు 122వ జయంతి వేడుకలను గురు వారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటా

నికి ఆర్డీవో మోహన్దాస్, ఎంపీపీ నారాయణ దాస్లు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. శాఖా గ్రంథాలయంలో, గ్రంథా లయ అధికారి రామ్కుమార్ మన్రో పాఠశాల విద్యార్థినిలతో కలిసి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఆర్డీవో మోహన్దాస్ మాట్లాడుతూ ఆంధ్రుల ఆశయ సాధనకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని పొట్టి శ్రీరాములు 56రోజులపాటు నిరాహార దీక్ష చేపట్టి ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు తమ ప్రాణాలను త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని ఆయన కొనియాడారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

హెచ్డీఎఫ్సీ, ఫ్లిప్కార్ట్ ఫస్ట్ కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్ ప్రారంభం

విశాలాంధ్ర-కర్నూలు: భారతదేశంలోని అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ హెచ్డీఎఫ్సీ, భారతదేశంలోని స్వదేశీ ఫ్లిప్కార్ట్ గ్రూప్ విస్తృతమైన ఆన్లైన్, ఆఫ్లైన్ ఉనికిని కలిగి ఉన్న ఓమ్నిచానెల్ బి2బి ప్లాట్ఫారమ్ ఇండస్ట్రీ-ఫస్ట్ కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్ ను ప్రారంభించింది. ఫ్లిప్కార్ట్ హెూల్సేల్ సభ్యుల కోసం క్రెడిట్ కార్డ్ డిస్కవర్ గ్లోబల్ నెట్వర్క్ లో భాగమైన డైనర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ నెట్వర్క్లో ఇది రన్ అవుతుంది. డైనర్స్ క్లబ్ కార్డ్లు ప్రపంచవ్యాప్తంగా 200 కంటే ఎక్కువ దేశాలలో ఉపయోగించవచ్చు. ఈ సందర్భంగా ఫ్లిప్కార్ట్ హెూల్సేల్ బిజినెస్ హెడ్ కోటేశ్వర్ ఎల్ఎన్ మాట్లాడుతూ ఫ్లిప్కార్ట్ హెూల్సేల్లోని సభ్యులు ఫ్లిప్కార్ట్ హెూల్సేల్ ఆన్లైన్ ఖర్చులపై ఐదు శాతం క్యాష్బ్యాక్ ఇండస్ట్రీ ఫస్ట్ ఆఫర్ను పొందవచ్చన్నారు.